ముగిసిన ప్రచార పర్వం..

మూగబోయిన మైక్‌లు
- చివరిరోజు పోటాపోటీగా ర్యాలీలు
- ముమ్మరంగా ఎన్నికల ఏర్పాట్లు





ఇల్లెందు: సింగరేణి స్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో వేసిన టెంట్లు

ఇల్లెందు: ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన ఎన్నికల జాతరలో అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం ముమ్మరంగా సాగింది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రచారం ముగిసింది. హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం.. ముగింపుతో మైక్‌లు మూగనోము పట్టాయి. రోడ్ల వెంట తోరణాలుగా వెలిసిన బ్యానర్లు, ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లను తొలగించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయింది. 10న నామినేషన్ల దరఖాస్తు చివరి తేదీ, 13న పరిశీలన, 15న ఉపసంహరణతో నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. అదే రోజున గుర్తుల కేటాయింపుతో అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. 13 రోజుల పాటు హోరాహోరీగా సాగిన ప్రచారం పట్టణంతో పాటు పల్లెలను చుట్టుముట్టింది. అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎన్డీ, ప్రజాపంథా, బీజేపీ, సీపీఎం అభ్యర్థులు తనదైన శైలీలో ప్రచారం చేశారు.

నియోజకవర్గంలో ఓటర్లు...

ఇల్లెందు నియోజకవర్గంలో 2,19,569 ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,07,909, మహిలలు 1,11,658, ఇతరులు ఇద్దరు ఉన్నారు. నియోజకవర్గంలో 138 గ్రామ పంచాయతీలు ఉండగా 54 రెవెన్యూ గ్రామాలు, 241పోలింగ్ కేంద్రాలున్నాయి. బయ్యారంలో 1 - 43, ఇల్లెందులో 44 - 130, టేకులపల్లిలో 131 - 174 , గార్లలో 175 - 205, కామేపల్లిలో 206 - 241 వరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రచారం ముగియడంతో సింగరేణి పాఠశాలలో అధికారులు ఎన్నికల మెటీరియల్ పంపిణీ చేసేందుకు అన్ని ఎర్పాట్లు చేశారు. ఎన్నికల అధికారి, సహాయ అధికారులకు, రూట్ ఆఫీసర్లకు, ఎన్నికల విధులు నిర్వర్తించే యంత్రాగం సర్వం సిద్ధంగా ఉంది. ఇదిలా ఉండగా ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు చాపకింద నీరులా గ్రామాల్లోకి వెళ్లి ఓట్లు తమవైపు మళ్లించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పోలింగ్ ఏజెంట్ల నియామక ఏర్పాట్లు, పోలింగ్ స్లిప్‌ల పంపిణీ పూర్తయింది.

జూలూరుపాడు: 30న జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి మంగళవారం సాయంత్రం 5 గంటలకు తెరపడింది. రెండు వారాలుగా ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం హోరెత్తించిన ప్రచార రథాల వాహనాలు, మైకులు, డీజేలు మూగపోయాయి. జూలూరుపాడు మండలంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, బీఎస్పీ, జనసేన పార్టీలకు చెందిన అభ్యర్థుల గెలుపు కోసం మద్దతుదారులు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు విస్తృతంగా ప్రచారం చేశారు. పాదయాత్రలు, బైక్ ర్యాలీలు, రోడ్‌షోలు, ప్రదర్శనలు, సభలు, సమావేశాలు, ఇంటింటికి తిరిగి అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. ఇంటింటికీ తిరిగి నమూనా ఈవీఎంలో ఆయ పార్టీల ఎన్నికల గుర్తులను ఓటర్లకు చూపించి చైతన్య పరిచారు.

క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

పాల్వంచ: ఈనెల 26న హైదరాబాద్ కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బీహెచ్‌ఈఎల్‌లోని శ్రీ మార్గదర్శిని పాఠశాలలో ఆరు వందల మంది నృత్యకారులతో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ కోసం నిర్వహించిన జానపద నృత్య నిరాజనం కార్యక్రమంలో పాల్వంచ డీఏవీ విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. అదేవిధంగా పాల్వంచ భజన మందిర రామాలయంలో నిర్వహించిన మండల స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీల్లో పలువురు విద్యార్థినులు బహుమతులు సాధించారు. వీరిని మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం ఎ.రామారావు, నాట్య గురువు జి.వెంకటేశ్వర్లు, శశికళ, రాజ్యలక్ష్మి అభినందించారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో..



ఛత్రపతినాథ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 14, 25, 26, తేదీలలో తెలంగాణ స్టేట్ లెవల్ స్విమ్మింగ్ టోర్నమెంట్‌లో సెయింట్ జోసఫ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలలో 8వ తరగతి శ్రీరాముల ఛత్రపతి నాథ్ 50, 100 ఫ్రీ స్టయిల్, 200 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో మూడు కాంస్య పతకాలు సాధించాడు. ఈ మేరకు ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి, కోచ్‌లు శామ్యూల్, శామంత్, సంధ్య ఛత్రపతిని మంగళవారం పాఠశాలలో అభినందించారు.

నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా..



మాట్లాడుతున్న జలగం వెంకట్రావు

చుంచుపల్లి: కొత్తగూడెం నియోజకవర్గంలో తన హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కొత్తగూడెం అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ప్రజలను అభ్యర్థించారు. మంగళవారం ఆయన చుంచుపల్లి మండలంలోని గౌతమ్‌పూర్, చుంచుపల్లి తండా, బాబూ క్యాంపు, విద్యానగర్ పాటు పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జలగం మాట్లాడుతూ... 2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఐదేళ్ల వరకు నిరంతరం కొత్తగూడెం అభివృద్ధి కోసం పరితపించానని తనవంతు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఏ అవసరమో గుర్తించి సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం ప్రజాప్రతినిధుల బాధ్యతన్నారు. తన హయాంలో ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసు శాఖ ప్రశాంత వాతావరణంలో పనిచేసిందని గుర్తు చేశారు. సింగభూపాలెం చెరువుతోపాటు చింతలచెరువుకు నిధులు మంజూరు చేయించిన ఘనత తనదేనన్నారు. ప్రజలు తమ సమస్యలను ఒక మెసేజ్ ద్వారా తెలిపితే వెంటనే స్పందించి పరిష్కార మార్గాలు చూపినవి ఎన్నో ఉన్నాయన్నారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, గ్రామాలకు అవసరమైన అంతర్గత రహదారులకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. నిరుద్యోగ యువతలో దాగి ఉన్న స్కిల్స్‌ను గుర్తించేందుకు ప్రత్యేక చొరవ తీసుకొని స్కిల్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జలగం చెప్పారు. ప్రజల అభీష్టం మేరకు అసెంబ్లీ ఎన్నికల్లో నిలబడ్డానని వారి ఉత్సాహం చూస్తుంటే గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. 30న జరిగే ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. ఈ ప్రచారంలో ఊకంటి గోపాలరావు, రాజు, నాని, మహేష్, జకరయ్య, జానకిరామ్, రాజు, నరసింహా పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో కూనంనేని గెలుపు ఖాయం



మాట్లాడుతున్న పోట్ల నాగేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 30న జరగనున్న సార్వత్రిక ఎన్నికలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), టీడీపీ, టీజేఎస్ ప్రజాపంథా బలపరుస్తున్న సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మచ్చ లేని మనిషి కూనంనేని గెలుపు కోసం పార్టీ శ్రేణులు, నాయకత్వం అహర్నిశలు కృషి గెలిపిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని ప్రస్తుత ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా వాటి అమలు విఫలమయిందన్నారు. ఓటర్లు కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి సాంబశివరావును భారీ మెజారిటితో గెలిపించాలని కోరారు. సమావేశంలో అభ్యర్థి కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ నాయకులు దయానంద్, బాలశౌరి, ధర్మారావు, రజియా బేగం, మౌలానా, సీపీఐ నాయకులు వాసిరెడ్డి మురళి, దళిత సంఘాల నాయకులు పూసపాటి శ్రీను, మందా హనుమంతు, ఆంతోటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేయిస్తా..

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం అశోక్‌నగర్‌లో కాంగ్రెస్ బలపరుస్తున్న కొత్తగూడెం సీపీఐ అసెంబ్లీ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుతో కలిసి టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యేగా కూనంనేని సాంబశివరావును గెలిపించాలని కోరారు. ప్రస్తుతం కొత్తగూడెంలో స్థానిక ఎమ్మెల్యే వనమా అభివృద్ధిలో విఫలమయ్యారు. ఈ ప్రచారంలో నాయకులు హనుమంతరావు, జగన్, సుందర్‌రావు, జరీనా, లక్ష్మీదేవిపల్లి మండలం ఓబీసీ అధ్యక్షుడు బి.వీరబాబు, బాబ్జి, బొల్లం ఉదయ్‌కుమార్, సత్తార్, శేఖర్, శ్రీకుమార్ తదితరులు ఉన్నారు.

మైనార్టీల అభివృద్ధికి పాటుపడతా..

ఇల్లెందు/ఇల్లెందురూరల్: మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఫలాలు అందించి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన కాంగ్రెస్ ఎన్నటికీ మైనార్టీల పక్షమేనని ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య తెలిపారు. ఇల్లెందులో మంగళవారం ముస్లిం మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో మైనార్టీల సంక్షేమానికి మరింతగా పాటుపడతానని తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీలు కనకయ్యకు మద్దతు ప్రకటించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎన్నికల ఇన్‌చార్జ్ మువ్వా విజయబాబుతో పాటు ఎస్.కే.జానీ, బానోతు సుజాత తదితరులు పాల్గొన్నారు. ఇల్లెందు మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ప్రచారంలో కనకయ్య మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని, ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాటి చుక్కమ్మ, శారద, తాటి బిక్షం, పోటు రవి, బాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే బతుకుల్లో మార్పు

బయ్యారం/గార్ల: కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే ప్రజల బతుకుల్లో మార్పు వస్తుందని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇల్లెందు అభ్యర్థి కోరం కనకయ్య తెలిపారు. బయ్యారం మండలంలోని కంబాలపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలుచేస్తామన్నారు. నాయకులు బానోత్ సుజాత, తదితరులు పాల్గొన్నారు. కాగా, కనకయ్య గెలుపు కోరుతూ గార్ల మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించగా, సర్పంచ్ రాందాస్, నాయకులు ఎద్దు లక్ష్మయ్య, వెంకటేశ్వరరావు, శ్రావణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే యాదవుల అభివృద్ధి

ఇల్లెందు: ఆర్థికంగా వెనుకబడిన యాదవులు, గొల్లకుర్మల అభివృద్ధి కాంగ్రెస్ గెలుపుతోనే సాధ్యమవుతుందని ఉమ్మడి ఖమ్మం జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ అధ్యక్షుడు మేకల మల్లిబాబు యాదవ్ తెలిపారు. ఇల్లెందులో మంగళవారం ఆయన మాట్లాడుతూ అర్హులైన యాదవులందరికీ గొర్రెలు ఇస్తామన్న హామీని కేసీఆర్ విస్మరించారని ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈసమావేశంలో కంబాల ములయ్య, ధనియాకుల రామారావు, పుట్టా ఉపేందర్, బిక్షపతి యాదవ్ పాల్గొన్నారు.





బయ్యారం: మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు, పక్కన కనకయ్య, ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం: వనమా





కొత్తగూడెంఅర్బన్: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మోటార్ సైకిల్ ర్యాలీ, పాల్వంచ: పెద్దమ్మగుడిలో పూజలు చేస్తున్న ఎంపీ వద్దిరాజు, వనమా

పాల్వంచ: ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం అని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కొత్తగూడెం బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం మండలంలోని జగన్నాథపురం, కేశవాపురం తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ... నియోజకవర్గంలో అన్నివర్గాల అభ్యున్నతికి వనమా 40 ఏళ్ల కృషి చేశారన్నారు. వనమా గెలుపుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. అనంతరం వనమాతో కలిసి మండలంలోని పెద్దమ్మగుడిలో ప్రత్యేక పూజలు చేశారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ..

కొత్తగూడెంఅర్బన్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం ముగిసింది. ప్రచారం చివరి రోజు కావడంతో కొత్తగూడెం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్రల ఆధ్వర్యంలో పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నియోజకవర్గంలోని విద్యానగర్ కాలనీ బైపాస్ క్రాస్ రోడ్డు వద్ద నుంచి ప్రారంభమై విద్యానగర్ కాలనీ, పోస్టాఫీసు, సూపర్‌బజార్, గణేష్ టెంపుల్, లక్ష్మీదేవిపల్లి మీదుగా ఇల్లెందు క్రాస్ రోడ్డు, నవభారత్, పాల్వంచ, పెద్దమ్మగుడి వరకు సాగింది.

కొత్తగూడెంరూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు గెలుపు కోసం ఎంపీటీసీ జిల్లా అధ్యక్షురాలు కొల్లు పద్మ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే, పేద ప్రజల సంక్షేమానికి మరిన్ని పథకాలు ప్రవేశపెట్టడం జరుగుతుందని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వనమా వెంకటేశ్వరరావు గెలుపు తధ్యమని, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రచారం నిర్వహించారు.

జాతీయ స్థాయి పోటీలకు నోయల్ ఎంపిక



పాల్వంచ: వచ్చే నెల హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు పాల్వంచకు చెందిన శ్రీ విద్య స్కూల్ 9వ తరగతి విద్యార్థి పి.నోయల్ ఎంపికయ్యాడు. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న స్విమ్మింగ్ పోటీల్లోనూ పాల్గొనున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో నోయల్‌ను ప్రిన్సిపాల్ రమాదేవి, కోచ్‌లు సామేలు, అఫ్జల్, తల్లిదండ్రులు ఉదయ్‌కుమార్, మమత అభినందించారు.

ప్లే డే వర్తింపజేయాలి

సింగరేణి(కొత్తగూడెం): 30న ఎన్నికల జరగనున్న దృష్ట్యా సింగరేణి యాజమాన్యం ఈ ఎన్నికల్లో విధులు నిర్వహించేందుకు క్లరికల్, సెక్రటేరియల్ ఉద్యోగులను 400 మందిని తరలించింది. వీరికి ప్లే డే వర్తింపజేయాలని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి మాధవ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవుదినాన్ని ప్రకటిస్తూ సర్క్యూలర్ విడుదల చేసింది. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఎటువంటి సర్క్యూలర్ జారీ చేయనందున వారికి ప్లే డే వర్తింపజేయాలని కోరారు. స్పందించిన వెల్ఫేర్ జీఎం బసవయ్య ప్రభుత్వ ఉద్యోగుల వలే అన్ని విధాల సహాయం అందిస్తామన్నారని తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనాలతో ఓట్లకు గాలం

పాల్వంచ: ఓట్ల కోసం పార్టీల నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. డబ్బు, ప్రచారం, ఆ పార్టీలో ఉన్న వారిని ఈ పార్టీలోకి, ఈ పార్టీలో ఉన్న వారిని ఆ పార్టీలోకి లాక్కోవడంలో పోటీ పడుతున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే కుల రాజకీయాలు మరో ఎత్తుగా నిలుస్తున్నాయి. వీటికి కార్తీక వన భోజనాలు తోడయ్యాయి. రాజకీయాలను బేరీజు వేసుకుంటూ ఓట్లకు గాలం వేస్తున్నారు. ఇక కులాల వారీగా చేసే ఆత్మీయ సమ్మేళనాలు సైతం ఏర్పాటు చేశారు. ఇటీవల కొత్తగూడెం నియోజకవర్గంలో మున్నూరు కాపు వనభోజనాలు నిర్వహించారు. ఆర్యవైశ్య వన భోజనాల్లో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారు. ఇక కాంట్రాక్టర్స్ కాలనీలో కమ్మ సామాజిక వర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఆత్మీయ సమ్మేళనాలకు అన్నిపార్టీల నాయకులు పాల్గొన్నారు. గెలిచిన తర్వాత భూ సమస్యలు పరిష్కరిస్తామంటూ వాగ్దానాలు గుప్పించారు. ఇదే విధంగా పలుచోట్ల కులాల వారీగా, వర్తక, వాణిజ్య సంఘాలను కలుస్తూ నైతిక మద్దతు కూడగట్టుకునే పనిలో నాయకులకు నిమగ్నమయ్యారు.

చివరిరోజు ముమ్మర ప్రచారం

టేకులపల్లి: శాసనసభ ఎన్నికల ప్రచారం మంగళవారం ముగిసింది. 30వ తేదీ ఎన్నికలు జరగనున్నాయి. బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బాదావత్ ప్రతాప్ మంగళవారం టేకులపల్లి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు బైక్ ర్యాలీ నిర్వహించారు. బహుజనుల రాజ్యస్థాపన కోసం తన ఎన్నికల గుర్తు ఏనుగుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీపీఎం అభ్యర్థి దుగ్గి కృష్ణ గుర్తు సుత్తి కొడవలి నక్షత్రంపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న తదితరులు ఇంటింటి ప్రచారం చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ విప్లవ పార్టీల అభ్యర్థి మోకాళ్ల కృష్ణ తన ఎన్నికల గుర్తు కుండపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ నాయకులు కల్తి వెంకటేశ్వర్లు, భూక్య హర్ష్య, ఎట్టి నరసింహారావులతో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. స్వతంత్ర అభ్యర్థులు గుమ్మడి అనురాధ గుర్తు ఎయిర్ కండీషన్‌పై ఓటు వేసి గెలిపించాలని ధర్మపురి వీరబ్రహ్మాచారి, జర్పుల సుందర్, కాంపాటి పృథ్వీ తదితరులు మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తన ఎన్నికల గుర్తు బెండకాయపై ఓటు వేసి గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి గుగులోత్ భద్రు తన అనుచరులతో కలిసి మండలంలో ప్రచారం చేశారు.

జంగ్ తెలంగాణ

మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి





ఇల్లెందు: ర్యాలీలో అభివాదం చేస్తున్న అభ్యర్థి హరిప్రియ, ఎంపీ రవిచంద్ర. గార్ల: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఇల్లెందు: గడిచిన ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, మరోమారు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హరిప్రియ తెలిపారు. ఇల్లెందులో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించగా గోవింద్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. ఇల్లెందు వాసుల ఆరు దశాబ్దాల కల అయిన ఆర్టీసీ డిపో ఏర్పాటుచేయడమే కాక 100 పడకల ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్ ఏర్పాటైందని, గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడంతో పాటు అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు, సీసీ రోడ్లు వేశామని తెలిపారు. ఈర్యాలీలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, గ్రంధాలయ సంస్థ జిల్లా చైర్మన్ దిండిగాల రాజేందర్‌తో పాటు సయ్యద్ జానీపాషా, మడత రమ, మడత వెంకటగౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తో ప్రతీ కుటుంబానికి భరోసా

ఇల్లెందురూరల్/టేకులపల్లి: ప్రతీ కుటుంబానికి భరోసా కల్పించేలా రాష్ట్రంలో బీఆర్ఎస్ పరిపాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ తెలిపారు. ఇల్లెందు మండలం బాలాజీనగర్‌లో ప్రచారం చేసిన ఆమె మాట్లాడుతూ బాలాజీనగర్‌లో సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించిన తనను మరోమారు గెలిపించాలని కోరారు. యాకూబీ, దాస్యం ప్రమోద్‌కుమార్, ఘాజీ, యాకయ్య, కోటి తదితరులు పాల్గొన్నారు. కాగా, టేకులపల్లి మండలంలోని గ్రామాల్లో హరిప్రియ ప్రచారం చేయగా, నాయకులు చీమల సత్యనారాయణ, బానోతు రామ, దళపతి శ్రీనవాస్‌రాజు, జర్పుల లచ్చు, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆశలు గల్లంతే..

బయ్యారం/గార్ల: అధికారంలోకి వస్తామనే ఆశతో ఉన్న కాంగ్రెస్ నాయకుల ఆశలు గల్లంతవడం కావడం జెడ్పీ చైర్‌పర్సన్ బిందు అన్నారు. ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ విజయాన్ని కాంక్షిస్తూ బయ్యారం మండలం వెంకటాపురంలో ఆమె ప్రచారం చేయగా, ఎంపీపీ మౌనికతో పాటు పొడుగు సుగుణ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇర్సులాపురానికి చెందిన పలువురు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాతా గణేష్ ఆధ్వర్యాన పార్టీలో చేరారు. గార్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరగా, ఎంపీపీ శివాజీచౌహాన్, మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ ఆహ్వానించారు. అనంతరం హరిప్రియ గెలుపు కోరుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ ధరావత్ సక్రుతోపాటు శీలంశెట్టి రమేష్, నాగమణి, బానోత్ రాజు, ఎం.డీ.ఖదీర్, భాస్కర్ రావు, పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి



హాజరైన పోలీసులు, హోంగార్డులు

జూలూరుపాడు: ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని జూలూరుపాడు సీఐ ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. ఓటర్లకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 100, 1950 నంబర్లకు ఫోన్ చేయవచ్చని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 16 రకాల కార్డుల్లో ఏదైనా ఒక కార్డుతో పోలింగ్ కేంద్రంలో అనుమతించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 4 గంటలతో ముగియడంతో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నాన్ లోకల్ వ్యక్తులు ఎవరైనా ఉంటే ఇక్కడ నుంచి వెళ్లిపోవాలన్నారు. వాహనాలు, మైకులతో ఎలాంటి ప్రచారాలు చేపట్టరాదన్నారు. పోలింగ్ స్టేషన్‌కు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే ఓటరు వద్ద సెల్‌ఫోన్ గానీ, ఫైరింగ్ మిషన్ వంటి వాటిని తీసుకరాకూడదన్నారు. అనంతరం పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. ఎస్ఐ బి.పురుషోత్తం, ఏఎస్సై తిరుపతిరావు, హెడ్ కానిస్టేబుల్స్, పోలీస్ కానిస్టేబుల్స్, హోంగార్డులు పాల్గొన్నారు.